

కాళోజీ చిరస్మరణీయుడు

కాళోజీ జయంతిని సోమవారం జిల్లాలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు.

- 9లో ▸



ప్రజావాణికి 109 ఫిర్యాదులు

ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు.

- 8లో ▸


వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 31.4 /23.2

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయి.

పార్టీల కసరత్తు

- ఇందూరు బల్దియాలో పాగా వేసేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్న బీజేపీ, కాంగ్రెస్
- పీఠంపై కూర్చునేందుకు నాయకుల యత్నాలు
- ఎంపీ, ఎమ్మెల్యే ఉండడంతో పట్టుదలగా బీజేపీ శ్రేణులు
- అధికారం ఉండడంతో పాటు పీసీసీ అధ్యక్షుడిగా మహేష్‌గౌడ్ కావడంతో జోష్‌లో కాంగ్రెస్ కార్యకర్తలు
- కాంగ్రెస్ నుంచి పీఠంపై కన్నేసిన కాలూరు భోజన్న, కేశ వేణు
- బీజేపీ తరఫున పీఠంపై గురిపెట్టిన న్యాలం రాజు, స్రవంతిరెడ్డి



న్యాలం రాజు

స్రవంతిరెడ్డి

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ఇందూరు నగరపాలక సంస్థ పీఠంపై పాగా వేసేందుకు ప్రధాన జాతీయ పార్టీలు ఇప్పటినుంచే గట్టిగా కసరత్తులు చేస్తున్నాయి. రాష్ట్రంలో అధికార పార్టీగా ఉన్న కాంగ్రెస్, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ నువ్వా నేనా అనేవిధంగా పోరు చేసే పరిస్థితి నెలకొంది. వచ్చే జనవరి 25న నిజామాబాద్ నగరపాలక కౌన్సిల్ కాలపరిమితి ముగియనుంది. కీలకమైన ఈ పీఠాన్ని దక్కించుకునేందుకు రెండు పార్టీలు గ్రౌండ్ ప్రిపేర్ చేసుకుంటున్నాయి. క్షేత్రస్థాయిలో కార్యకర్తలను సన్నద్ధం చేసుకునే పనిలో నిమగ్నమయ్యాయి. దీంతో రెండు జాతీయ పార్టీల మధ్య నగర పోరు రసవత్తరం కానుంది.

క్షేత్రస్థాయిలో బీజేపీకి పట్టు

బీజేపీకి రాష్ట్రంలోనే అత్యధికంగా క్షేత్రస్థాయిలో పట్టు, ప్రాబల్యం, బలం కలిగిన ఉన్న జిల్లాగా ఇందూరుకు పేరుంది. లోక్‌సభ, శాసనసభ స్థానాలను గెలుచుకోవడంతో పాటు స్థానిక సంస్థల స్థానాల్లోనూ గతం నుంచే బీజేపీ చాలా గట్టి పోటీ ఇస్తూ వస్తోంది. పలు చోట్ల పాగా వేస్తూ వస్తోంది. రానురాను బీజేపీకి యువత మరింత బలంగా మద్దతు ఇస్తోంది. ఇదిలా ఉండగా గత నగరపాలక ఎన్నికల్లో బీజేపీ అతిపెద్ద పార్టీగా నిలిచింది. ఇందూరు బల్దియాలో గత ఎన్నికల్లో బీజేపీ 28 మంది కార్పొరేటర్లను గెలుచుకుంది. ఎంఐఎం 16 స్థానాలు గెలుచుకోగా, బీఆర్‌ఎస్ 12 స్థానాలు మాత్రమే గెలుచుకుంది. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పటికీ బీజేపీ తన సత్తాకు తిరుగులేదని చాటింది. కాంగ్రెస్ 2 చోట్ల, స్వతంత్రులు మరో 2 స్థానాల్లో విజయం సాధించారు. బీఆర్‌ఎస్, ఎంఐఎం కలిసి ఎక్స్ అఫీషియో ఓట్లతో గట్టెక్కి మేయర్, డిప్యూటీ మేయర్ దక్కించుకున్నాయి. రాష్ట్రంలో అధికారం మారడంతో ప్రస్తుతం బీజేపీ, కాంగ్రెస్ మధ్య పోటీ నువ్వా, నేనా అనేలా మారింది.

■ వరుసగా రెండోసారి నిజామాబాద్ ఎంపీగా అర్వింద్ ఎన్నికయ్యారు. ఇక బీజేపీ తరఫున ఎమ్మెల్యేగా వివాదరహితుడైన ధన్‌పాల్ సూర్యనారాయణ గెలుపొందారు. ఎంపీ, ఎమ్మెల్యే ప్రాతినిధ్యంతో పాటు గత ఎన్నికల్లో అతిపెద్ద పార్టీగా సత్తా చాటడం, ఈసారి మరింత ప్రాబల్యం పెంచుకున్న నేపథ్యంలో ఈ పీఠంపై పాగా వేసేందుకు బీజేపీ ఇప్పటికే క్షేత్రస్థాయిలో ముమ్మర కసరత్తులు చేస్తోంది. సంఘ్‌పరివార్ సైతం చాపకింద నీరులా పనిచేస్తోంది. రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు మేయర్ పీఠం సాధించేందుకు ఎంపీ అర్వింద్ ప్రణాళికలు రచిస్తున్నారు. రిజర్వేషన్‌ను బట్టి మేయర్ పీఠంపై కూర్చునేందుకు నాయకులు లెక్కలు వేసుకుంటున్నారు. బీజేపీ ఫ్లోర్ లీడర్ స్రవంతి రెడ్డి రిజర్వేషన్ కలిసొస్తే మేయర్ కావాలని కోరుకుంటున్నారు. మరోవైపు బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్‌గా ఉన్న న్యాలం రాజు సైతం మేయర్ పదవి కోసం ఎదురు చూస్తున్నారు. బీజేవైఎం నుంచి పార్టీకి సేవలందిస్తున్న న్యాలం రాజు ప్రస్తుతం జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. న్యాలం రాజు భార్య సునీత సైతం మాజీ కార్పొరేటర్‌గా ఉండి ఫ్లోర్ లీడర్‌గా వ్యవహరించారు. బీసీ జనరల్ వస్తే న్యాలం రాజు, బీసీ మహిళ వస్తే సునీతను మేయర్ రేసులో ఉంచేందుకు సిద్ధమయ్యారు. పైగా నగరంలో కీలకమైన మున్నూరుకాపు సామాజిక వర్గం కావడంతో మరింత కలిసొస్తుందని భావిస్తున్నారు.

పక్కా ప్రణాళికతో కాంగ్రెస్

రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి సంబంధించి ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ పీసీసీ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. దీంతో కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్ అనేక రెట్లు పెరిగింది. మేయర్ పీఠాన్ని చేజిక్కించుకునే విషయంలో మహేష్ పకడ్బందీ ప్రణాళికతో ముందుకు వెళ్లేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. బీసీ నేత కావడంతో పాటు మైనారిటీ వర్గాల్లో తిరుగులేని పట్టు కలిగి ఉన్న మహేష్ నేతృత్వంలో బల్దియాలో పాగా వేసేందుకు కాంగ్రెస్ నాయకులు ఇప్పటి నుంచే లెక్కలు వేసే పనిలో పడ్డారు. మహేష్‌కు గట్టి అనుచరుడుగా ఉన్న సీనియర్ నాయకుడు కాలూరు భోజన్న మేయర్ పీఠంపై కన్నేశారు. అందుకు అనుగుణంగా పావులు కదుపుతున్నారు. విలీన గ్రామమైన కాలూరుకు చెందిన భోజన్న గతంలో సర్పంచ్‌గా పనిచేశారు. కాలూరు నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో ఉంది. మహేష్‌కు అనుచరుడు కావడంతో పాటు ఎమ్మెల్యే భూపతిరెడ్డితో ఉన్న సఖ్యత ఆయనకు కలిసి వస్తాయని భావిస్తున్నారు. నగర కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉన్న కేశ వేణు సైతం మేయర్ పదవి కోసం ప్రయత్నాలు చేస్తున్నారు.

కలెక్టరేట్‌కు వచ్చిన వృద్ధ దంపతులు సంగం నర్సుబాయి, గంగారాం



‘పింఛన్ ఇవ్వండి సారూ..’

ఆలూరు మండలం గంగుపల్లి గ్రామానికి చెందిన ఈ వృద్ధ దంపతులు సంగం నర్సుబాయి, గంగారాం సోమవారం కలెక్టరేట్‌కు వచ్చారు. నర్సుబాయికి ఓ కన్ను కనిపించదు. ఇటీవల కాలుకు ఆపరేషన్ అయ్యింది. కంటి ఆపరేషన్ కోసం హైదరాబాద్ వెళ్లాలని వైద్యులు సూచించారు. అయితే వీరిద్దరికీ పింఛన్ రావడం లేదు. ఎన్నిసార్లు దరఖాస్తు చేసినా పింఛన్ ఇవ్వడం లేదని వాపోయారు. మరోసారి ప్రజావాణిలో దరఖాస్తు ఇచ్చి వెళ్లిపోయారు. – సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్–నిజామాబాద్

వర్సిటీ లైబ్రరీకి పుస్తకాలు అందజేత

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పూర్వ విద్యార్థి, సంగారెడ్డి జిల్లా కోర్టు సీనియర్ సివిల్ జడ్జి రాధాకృష్ణ చౌహాన్ వర్సిటీ సెంట్రల్ లైబ్రరీకి పోటీ పుస్తకాలు వితరణ చేశారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థుల కోసం తన వంతు సాయంగా పుస్తకాలను అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు సోమవారం తెయూ రిజిస్ట్రార్ యాదగిరిని కలిసి పుస్తకాలు అందించారు. తెయూ న్యాయ శాస్త్ర విభాగంలో పీహెచ్‌డీ పూర్తి చేసిన రాధాకృష్ణ చౌహాన్ ప్రస్తుతం సంగారెడ్డి జిల్లా కోర్టులో సీనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వహిస్తుండటం వర్సిటీకి గర్వకారణమని రిజిస్ట్రార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ సత్యనారాయణ, కాంపిటెటివ్ సెల్ డైరెక్టర్ రమణాచారి పాల్గొన్నారు.



పుస్తకాలు అందజేస్తున్న సంగారెడ్డి జిల్లా కోర్టు సీనియర్ సివిల్ జడ్జి రాధాకృష్ణ చౌహాన్

రైతులందరికీ రుణమాఫీ చేయాలి

- వెంటనే పసుపు బోర్డు ఏర్పాటు చేయాలి
- బీకేఎస్ ఏపీ ప్రథమ అధ్యక్షుడు సూర్యనారాయణరెడ్డి



మాట్లాడుతున్న సూర్యనారాయణరెడ్డి

సుభాష్‌నగర్: అర్హులైన రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని భారతీయ కిసాన్ సంఘ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రథమ అధ్యక్షుడు సూర్యనారాయణరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో భారతీయ కిసాన్ సంఘ్ రైతు మహాసభ జిల్లా అధ్యక్షుడు కె నారాయణరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా పలు తీర్మానాలు చేశారు. జిల్లాలో సారంగాపూర్ చక్కెర కర్మాగారం మూతబడినందున రైతులు చాలా నష్టపోతున్నారని, ఈ విషయాన్ని గమనించి రాష్ట్ర ప్రభుత్వం ఫ్యాక్టరీని వెంటనే ప్రారంభించాలని, లేకుంటే సహకార చట్టాన్ని గౌరవించి రైతు పాలక వర్గానికి అప్పగించాలని తీర్మానించారు. అనంతరం సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ అనేక మంది రైతులు ధరణితో సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. జిల్లాలో పసుపు బోర్డు ఏర్పాటు చేస్తామని కేంద్ర ప్రభుత్వం జీవో జారీ చేసిందని, కానీ ఇంతవరకూ ఏర్పాటు చేయలేదన్నారు. డిసెంబర్, జనవరిలో పసుపు పంట అమ్మకానికి వస్తుందని తెలిపారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం స్పందించి జిల్లాలో పసుపు బోర్డును ఏర్పాటు చేసి పసుపు రైతులకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం బీకేఎస్ జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా దేవుడిగారి సాయిరెడ్డి, ఉపాధ్యక్షులుగా ఎం సూర్యారెడ్డి, కరుణరెడ్డి, కార్యదర్శిగా మమ్మాయి రాజన్న, సహ కార్యదర్శులుగా శ్రీనివాస్ రెడ్డి, దినేష్, కోశాధికారిగా జే భూమారెడ్డి, యువ ప్రముఖ్‌గా కె సాయినాథ్‌రెడ్డి, సేంద్రియ ప్రముఖ్ పాపారావు, చెరుకు ప్రముఖ్ లక్ష్మారెడ్డి, విద్యుత్ ప్రముఖ్ లక్ష్మారెడ్డి, రెవెన్యూ ప్రముఖ్ కుంట వెంకట్‌రెడ్డి, కార్యవర్గసభ్యులుగా వినయ్‌కుమార్, వై సంతోష్, బాలన్న, కె నారాయణరెడ్డి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో బీకేఎస్ అఖిల భారత కార్యదర్శి కె సాయిరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు లావణ్య రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఆనందరావు, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ విభాగ్ ప్రచారక్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వరదలో పోతున్న చేపలు!

- ఆందోళన చెందుతున్న మత్స్యకారులు
- వరద కాలువకు జాలి గేట్లను అమర్చాలని డిమాండ్



వరద కాలువ గేట్లకు కొట్టుకొని పడిన చేపలు.. ప్రవహిస్తున్న వరద కాలువ

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి వరద కాలువ ద్వారా నీటి విడుదల కొనసాగుతుండటంతో జలాశయంలోని చేపలు కొట్టుకుపోతున్నాయని మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరద కాలువ 1,075 అడుగుల నీటి మట్టం వద్ద ఉండటతో చేపలు ఎత్తు వైపునకు ఈదుతు వస్తాయని మత్స్యకారుల అంటున్నారు. దీంతో ప్రాజెక్ట్‌లోని చేపలు ప్రతి సంవత్సరం అధికంగా వరద కాలువ ద్వారా కొట్టుకుపోతున్నాయని చెబుతున్నారు. ప్రస్తుతం వరద కాలువ ద్వారా 18 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో చేపలు, చేప పిల్లలు భారీగా కొట్టుకుపోతున్నాయి. 2010 నుంచి వరద కాలువ ద్వారా నీటి విడుదల ప్రారంభించారు. అప్పటి నుంచి ప్రాజెక్ట్‌లో చేపలు లేకుండా పోయాయని మత్స్యకారులు అంటున్నారు. ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లలను ప్రాజెక్ట్‌లో వదిలినా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోతుందంటున్నారు.

ప్రతిపాదనలకే పరిమితం

వరద కాలువ హెడ్ రెగ్యులేటర్ వద్ద జాలి గేట్లను అమర్చాలని 2010 నుంచి మత్స్యకారులు డిమాండ్ చేస్తున్నారు. గతంలో పలుమార్లు వరద కాలువ జాలి గేట్ల కోసం ఇంజినీర్ల బృందం పరిశీలన చేసింది. ఇప్పటి వరకు అడుగులు ముందుకు పడలేదు. జాలి గేట్లను అమర్చితే ఇంతస్థాయిలో చేపలు కొట్టుకుపోవని మత్స్యకారులు అంటున్నారు.

నష్టపోతున్నాం



వరద కాలువ ద్వారా నీటితో పాటు చేపలు కొట్టుకుపోతున్నాయి. ఎత్తు భాగంలో వరద కాలువ గేట్లు ఉండటంతో చేపలు ఎదురీదుతూ వచ్చి కాలువలో పోతున్నాయి. దీంతో మత్స్యకారులం తీవ్రంగా నష్టపోతున్నాం.

– దుర్గాప్రసాద్, మత్స్యకారుడు, అమ్రాయికాలనీ

ప్రభుత్వం పట్టించుకోవాలి



వరద కాలువకు వెంటనే జాలి గేట్లను ఏర్పాటు చేయాలి. గత కొన్నాళ్లుగా ప్రభుత్వాలను అడుగుతునే ఉన్నాం. కానీ ఎవరు పట్టించుకోవడం లేదు. ప్రస్తుత ప్రభుత్వమైన పట్టించుకుని మత్స్యకారులను ఆదుకోవాలి. – శ్రీనివాస్, మత్స్యకారుడు, ముప్కాల్

ఎస్సీ కార్పొరేషన్ నామమాత్రమేనా?

- 2019 నుంచి విడుదల కాని నిధులు
- నిలిచిన దళితబంధు పథకం
- ఉపాధికి దూరమవుతున్న ఎస్సీ యువత



కలెక్టరేట్‌లోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయం

నిజామాబాద్ అర్బన్: ఎస్సీలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ఏర్పాటు చేసిన ఎస్సీ కార్పొరేషన్ నామమాత్రంగా మారిపోయింది. ప్రతి ఏడాది సబ్సిడీ కింద రుణాలను అందిస్తూ వివిధ ఉపాధి అవకాశాలను కల్పిస్తూ ఉండే ఎస్సీ కార్పొరేషన్ గత ఐదేళ్లుగా నిధులు లేక ఉత్సవ విగ్రహంలా మారింది. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా జిల్లాకు ప్రతి ఏటా రూ.తొమ్మిది కోట్లు మంజూరయ్యేవి. ఈ నిధులతో 300 నుంచి 400 మందికి సబ్సిడీపై రుణాలు అందించేవారు. దీంతో వారు వ్యాపారాలు, వాహనాలు వంటివి తీసుకొని ఉపాధి పొందేవారు. బ్యాంకు సమ్మతి ద్వారా ఎస్సీ కార్పొరేషన్ రుణాలను ఇస్తుంది. కానీ 2018–19లో చివరిసారిగా జిల్లాకు నిధులు వచ్చాయి. అప్పటి నుంచి సబ్సిడీ రుణాల కోసం ప్రభుత్వం నిధులను కేటాయించడం లేదు. అయితే గత ప్రభుత్వం దళిత బంధు పథకం అమలు చేసింది. 2023–24 సంవత్సరానికి దళిత బంధు మొదటి విడతలో 550 మందికి 55 కోట్ల రూపాయలతో వివిధ ఉపాధి అవకాశాలు కల్పించారు. రెండో విడత 660 దరఖాస్తులను స్వీకరించారు. ఎన్నికల నోటిఫికేషన్ ప్రారంభం కావడంతో ఈ ప్రక్రియ నిలిచిపోయింది.

ఉపాధి లేక ఇబ్బందులు

ఎస్సీ కార్పొరేషన్‌కు నిధులు లేకపోవడంతో జిల్లా లోని దళిత కుటుంబాలకు చెందిన నిరుద్యోగులు ఉపాధి కోసం ఇబ్బందులు పడుతున్నారు. దళిత బంధు ద్వారా కొందరు రాజకీయ నాయకుల అనుచరులే లబ్ధి పొందారని ఆరోపణలు ఉన్నాయి. ఆర్థి కంగా వెనుకబడిన ఎస్సీలకు ఎలాంటి లబ్ధి చేకూరలేదని విమర్శలు ఉన్నాయి. కనీసం ఎస్సీ కార్పొరేషన్ ద్వారానైనా నిధులు విడుదల చేస్తే చిన్న దుకాణం పెట్టుకొనైనా జీవనం కొనసాగిస్తామని పలువురు పేర్కొంటున్నారు. దళిత బంధు, ఎస్సీ కార్పొరేషన్ రెండు రాకపోవడంతో ప్రస్తుతం ఉపాధి కోసం ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం స్పందించి నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఎన్నికల సమయంలో దళితులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతున్నారు.

సబ్సిడీ రుణాలు కొనసాగించాలి



కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలను కొనసాగించాలి. ఈ లోన్లతో ఎంతో మంది ఉపాధి పొందారు. ప్రస్తుతం కూడా ప్రభుత్వం ప్రతి ఏటా రెండు సార్లు నిధులను కేటాయించాలి. అప్పుడే ఎస్సీలకు ఆర్థికంగా తోడ్పాటు లభిస్తుంది.

– సరికెల పోశెట్టి, మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు

నిధులు మంజూరైతే..



ప్రస్తుతం నిధుల కోసం ఎదురు చూస్తున్నాం. నిధులు మంజూరు కాగానే దరఖాస్తులు తీసుకొని లబ్ధిదారులను ఎంపిక చేస్తాం. దళిత బంధుపై ఎలాంటి సమాచారం లేదు. ప్రస్తుతం సబ్సిడీ రుణాలు అందించేందుకు ప్రణళిక సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది.

– రమేష్, జిల్లా ఎస్సీ కార్పొరేషన్ అధికారి

న్యూస్‌రీల్

నేడు బీజేపీ సభ్యత్వ నమోదు ప్రారంభం

సుభాష్‌నగర్: బీజేపీ సభ్యత్వ నమోదు ప్రారంభ కార్యక్రమం మంగళవారం ఉదయం 10.30 గంటలకు నగరంలోని నిఖిల్‌సాయి హోటల్‌లో ఏర్పాటు చేసినట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేష్ పటేల్ కులాచారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డితోపాటు నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి, ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ, పైడి రాకేష్‌రెడ్డి హాజరు కానున్నారని పేర్కొన్నారు.

సంప్రదాయ పద్ధతులపై శిక్షలు తగవు

ఆర్మూర్: విద్యార్థులు తమ సంప్రదాయమైన రక్షా బంధన్, మెహందీ, తిలకం పెట్టుకుని పాఠశాలకు వస్తే ఉపాధ్యాయులు వారిని దండించడం మానసిక క్షోభకు గురి చేయడమే అవుతుంది. ఇలా విద్యార్థులను దండించడం ఇక చెల్లదని తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, సమగ్ర శిక్ష ఎక్స్ అఫీషియో స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డి ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు విద్యార్థులను వేధింపులకు గురి చేయడం జాతీయ బాలల రక్షణ కమిషన్ దృష్టికి వచ్చిందన్నారు. ఈ విషయాన్ని గమనిస్తూ తగు చర్య లు తీసుకోవాలని సూచిస్తూ డీఈవోలకు ఉత్తర్వులు జారీ చేశారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

డిచ్‌పల్లి: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (ఆర్‌ఎస్‌ఈటీఐ) ఆధ్వర్యంలో ఈ నెల 16 నుంచి ప్రారంభమయ్యే ఉచిత శిక్షణ తరగతులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ సుంకం శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీసీ టీవీ ఇన్‌స్టాలేషన్ (13 రోజులు), సెల్‌ఫోన్ రిపేర్ (30 రోజులు), ఏసీ రిపేర్ (30 రోజులు)లో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. 19 నుంచి 45 ఏళ్లలోపు నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు చెందిన గ్రామీణ ప్రాంత యువకులు మాత్రమే అర్హులని తెలిపారు. వివరాలకు 08461–295428 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

నిద్రా ఏర్పాటు చేయాలని రేపు సమావేశం

నిజామాబాద్‌నాగారం : జిల్లాలో చెరువులు, నాలాల ఆక్రమణాలపై నిద్రా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం అఖిల పక్ష సమావేశం నిర్వహించున్నారు. ఉదయం 10.30 గంటలకు ఖలీల్‌వాడిలోని కేశవులు ఆస్పత్రిలో సమావేశం ఉంటుందని సీనియర్ న్యూరో సైకియాట్రిస్ట్ కేశవులు ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని పార్టీల నాయకులు హాజరు కావాలని కోరారు.

రేపు టేబుల్ టెన్నిస్ క్రీడాకారుల ఎంపిక

నిజామాబాద్ నాగారం: నిజామాబాద్ ఉమ్మడి జిల్లాకు సంబంధించి అండర్–19 టేబుల్ టెన్నిస్ విభాగంలో బాలబాలికల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని ఆఫీసర్ క్లబ్‌లో ఉదయం 11గంటలకు ఎంపికలు ఉంటాయని ఆసక్తి గల క్రీడాకారులు బోనాఫైడ్ తీసుకోని రావాలని సూచించారు.

తొమ్మిది రోజులు.. 22.2 టీఎంసీలు

నిజాంసాగర్: నిజాంసాగర్ ప్రాజెక్టులోకి ఈనెలలో 22.2 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది. ఈనెల 4న ప్రాజెక్టు నిండుకుండలా మారడంతో అధికారులు గేట్లను ఎత్తి నీటిని మంజీర నదిలోకి విడిచిపెట్టారు. ఆరు రోజుల్లో 9.7 టీఎంసీల నీటిని మంజీర నదిలోకి వదిలారు. ఎగువ ప్రాంతాల నుంచి వరద నీటి ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో నిజాంసాగర్ ప్రాజెక్టు వరద గేట్లను సోమవారం సాయంత్రం మూసి వేశారు.

అలీసాగర్ గేటు ఎత్తివేత



ఎడపల్లి: మండలంలోని అలీసాగర్ ఒక గేటు ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. నిజాంసాగర్ ప్రధాన కాలువకు 400 క్యూసెక్కుల నీరు వస్తుండటంతో అలీసాగర్ రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటిమట్టానికి చేరింది. దీంతో ఇరిగేషన్ అధికారులు ఒక గేటు ఎత్తి 400 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు.

క్లుప్తంగా

వృద్ధాశ్రమంలో పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌నాగారం: డిచ్‌పల్లి మండలం రాంపూర్‌లో ప్రభుత్వ, రెడ్‌ క్రాస్‌ ఆధ్వర్యంలో నిర్వహించనున్న వృద్ధాశ్రమంలో పలు పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు రెడ్‌ క్రాస్‌ జిల్లా చైర్మన్‌ బుస్సా ఆంజనేయులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హోమ్‌ కో ఆర్డినేటర్‌-1, అసిస్టెంట్‌ కో ఆర్డినేటర్‌ -1, ఏఎన్‌ఎం-1, వంట మనిషి-1, వంట సహాయకుడు-1, మల్టీ టాస్కింగ్‌ స్టాఫ్‌-4 పోస్టులను భర్తీ చేయనున్నామని, ఆసక్తిగల వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను జిల్లా కేంద్రంలోని ఖలీల్‌వాడిలో ఉన్న రెడ్‌క్రాస్‌ సొసైటీలో అందజేయాలని సూచించారు. మరిన్ని వివరాలకు పీఆర్‌వో రామకృష్ణ (86888 87004)ను సంప్రదించాలని సూచించారు.

టెక్నికల్‌ టీచర్‌ సర్టిఫికెట్‌ పరీక్షాఫలితాలు విడుదల

నిజామాబాద్‌అర్బన్‌: టెక్నికల్‌ టీచర్స్‌ సర్టిఫికెట్‌ పరీక్షాఫలితాలు విడుదలైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్‌ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీటీసీ కోర్సు లోయర్‌ గ్రేడ్‌ ఫలితాలను విడుదల చేసినట్లు పేర్కొన్నారు. ఫలితాలను సంబంధిత వెబ్‌సైట్‌లో చూసుకోవాలని సూచించారు.

14 క్వింటాళ్ల పీడీఎస్‌ బియ్యం పట్టివేత



బోధన్‌ : పట్టణంలోని గోశాల రోడ్డులో ఉన్న ఉమామహేశ్వర్‌ ట్రేడర్స్‌ తోపాటు ప్యాసింజర్‌ ఆటోలో మొత్తం 14 క్వింటాళ్ల 70 కిలోల పీడీఎస్‌ బియ్యం పట్టుకున్నట్లు సివిల్‌ సప్లయీస్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ నాయబ్‌ తహసీల్దార్‌ హనుమాన్‌ సోమవారం రాత్రి తెలిపారు. ప్యాసింజర్‌ ఆటోలో పీడీఎస్‌ బియ్యాన్ని తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసుల సహకారంతో వెంబడించామని, గోశాల రోడ్డులోని ఉమామహేశ్వర ట్రేడర్స్‌ వద్ద నిలిపిన ఆటోను తనిఖీ చేయగా 3 క్వింటాళ్ల 50 కిలోల బియ్యం, దుకాణంలో 11 క్వింటాళ్ల 20 కిలోల పీడీఎస్‌ బియ్యం పట్టుబడిందన్నారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని ఎంఎల్‌ఎస్‌ పాయింట్‌కు తరలించామని వెల్లడించారు. పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారని తెలిపారు.

ప్రజావాణికి 109 ఫిర్యాదులు



ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్‌ అంకిత్‌ తదితరులు

నిజామాబాద్‌అర్బన్‌: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 109 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్‌ అంకిత్‌, ట్రెయినీ కలెక్టర్‌ సంకేత్‌కుమార్‌, డీఆర్డీవో సాయాగౌడ్‌, నిజామాబాద్‌ ఆర్డీవో రాజేంద్రకుమార్‌కు విన్నవిస్తూ అర్జీలు అందజేశారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ సమస్యలను పరిష్కరించాలని అధికారులను కలెక్టర్‌ ఆదేశించారు. ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

చెరువు ఆక్రమణలను అడ్డుకోండి



నగరంలోని అర్సపల్లి రామర్తి చెరువు ఆక్రమణలను అడ్డుకోవాలని అర్సపల్లి గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. సర్వే నంబర్‌ 216లో 29 ఎకరాలు ఉండగా, చెరువు సగ భాగం ఆక్రమణకు గురైందన్నారు. అలాగే అర్సపల్లి గాడికుంట చెరువు సర్వే నంబర్‌ 169లో 8 ఎకరాల విస్తీర్ణంలో ఉండగా అక్రమణకు గురైందన్నారు. అధికారులు వెంటనే విచారణ చేపట్టి చెరువు ఆక్రమణలను అడ్డుకోవాలని కోరారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోండి

డిచ్‌పల్లి మండలం కొరట్‌పల్లి గ్రామ పరిధిలో అటవీ భూమి ఆక్రమణకు గురైందని, అధికారులు వెంటనే ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని కొరట్‌పల్లి గ్రామాభివృద్ధి కమిటీ నాయకులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. రెవెన్యూ శివారులోని సర్వే నంబర్‌ 380లో 508 ఎకరాలు, 367 సర్వే నంబర్‌లో 95 ఎకరాలు, దాదాపు 600 ఎకరాల భూమిని కొందరు తండావాసులు ఆక్రమించారని, పశువులకు మేత లేకుండా చేస్తున్నారని, వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు.



శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌ గేట్ల మూసివేత

- ఎగువ నుంచి తగ్గిన ఇన్‌ఫ్లో
- నాలుగు టర్బయిన్ల ద్వారా కొనసాగుతున్న విద్యుదుత్పత్తి



మూసి ఉన్న వరద గేట్లు

బాల్కొండ: శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు తగ్గుముఖం పట్టడంతో ప్రాజెక్ట్‌ అధికారులు గోదావరిలోకి నీటి విడుదలను నిలిపివేశారు. సోమవారం రాత్రి 7 గంటలకు గేట్లను మూసివేశారు. సోమవారం ఉదయం నుంచి ప్రాజెక్ట్‌లోకి క్రమంగా ఇన్‌ ఫ్లో తగ్గడంతో వరద గేట్ల ద్వారా నీటి విడుదలను సైతం తగ్గించారు. మధ్యాహ్నం నుంచి 5 గేట్ల ద్వారా 15,620 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదిలిన అధికారులు రాత్రికి పూర్తిగా నిలిపి వేశారు. క్రితం రోజు లక్ష 26 వేల క్యూసెక్కుల వరద నీరు గరిష్టంగా వచ్చి చేరింది. క్రమంగా సోమవారం ఉదయం నుంచి తగ్గుతూ వచ్చింది. మధ్యాహ్న సమయానికి 42,517 క్యూసెక్కుల ఇన్‌ ఫ్లో రాగా, రాత్రికి మరింత తగ్గి 25 వేల క్యూసెక్కులకు పడిపోయింది. ప్రాజెక్టునుంచి వరద కాలువ ద్వారా 18 వేల క్యూసెక్కులు, కాకతీయ కాలువ ద్వారా 4 వేలు, ఎస్కేప్‌ గేట్ల ద్వారా 4 వేల క్యూసెక్కులు విడుదల చేస్తుండగా, ఆవిరి రూపంలో 666 క్యూసెక్కుల నీరు పోతోంది. మిషన్‌ భగీరథ తాగు నీటి అవసరాలకు 231 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు. ప్రాజెక్టుపూర్తి స్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా సోమవారం సాయంత్రానికి 1089.90(80.05 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్‌ అధికారులు పేర్కొన్నారు.

36.20 మెగావాట్ల విద్యుదుత్పత్తి

ప్రాజెక్ట్‌ నుంచి ఎస్కేప్‌ గేట్ల ద్వారా 4 వేల క్యూసెక్కులు, కాకతీయ కాలువ ద్వారా 4 వేల క్యూసెక్కుల నీరు విడుదల కావడం, ప్రాజెక్ట్‌ నిండుకుండలా ఉండటంతో స్థానిక జల విద్యుదుత్పత్తి కేంద్రంలో నాలుగు టర్బయిన్‌ల ద్వారా సామర్థ్యానికి మించి 36.20 మెగావాట్ల విద్యుత్‌ ఉత్పత్తి అవుతోంది. ప్రస్తుత సీజన్‌లో ఇదే గరిష్ట విద్యుత్‌ ఉత్పత్తి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 9.49 మిలియన్‌ యూనిట్ల విద్యుత్‌ ఉత్పత్తి జరిగిందని జెన్‌కో డీఈ శ్రీనివాస్‌ తెలిపారు.

'13లోగా ఫీజు చెల్లించండి'

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని విద్యార్థులు ఎంఈడీ రెండో సెమిస్టర్‌ రెగ్యులర్‌ పరీక్ష ఫీజును ఈ నెల 13వ తేదీలోగా చెల్లించాలని కంట్రోలర్‌ ప్రొఫెసర్‌ ఎం అరుణ సోమవారం ఒక ప్రకటనలో సూచించారు. రూ.100 అపరాధ రుసుముతో ఈ నెల 19వరకు ఫీజు చెల్లించే అవకాశం ఉంటుందని కంట్రోలర్‌ తెలిపారు. పూర్తి వివరాలకు తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్‌ www.telanganauniversity.ac.in ను సంప్రదించాలని ఆమె సూచించారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం



ట్రోఫీ అందుకుంటున్న రాంపూర్‌ ఉన్నత పాఠశాల బాలికల జట్టు క్రీడాకారిణులు

మాచారెడ్డి : క్రీడల్లో గెలుపోటములు సహజమని పాల్వంచ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం గోవర్ధన్‌ రెడ్డి అన్నారు. సోమవారం పాల్వంచలో నిర్వహించిన 34వ సబ్‌ జూనియర్‌ బాలుర, బాలికల ఉమ్మడి జిల్లా స్థాయి ఖోఖో టోర్నమెంట్‌ ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ టోర్నమెంట్‌లో 38 బాలుర, 22 బాలికల జట్లు తలపడ్డాయి. రాష్ట్ర స్థాయికి ఎంపికైన ఖోఖో క్రీడాకారులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఖోఖో అసోసియేషన్‌ అధ్యక్షుడు జీవీ భూమారెడ్డి, ప్రధాన కార్యదర్శి అతికుల్లా, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌ పర్సన్‌ రాధ, అసోసియేషన్‌ ప్రతినిధులు నాగేశ్వర్‌ రావు, మధుసూదన్‌ రెడ్డి, మోహన్‌ రెడ్డి, అనిల్‌ కుమార్‌, భాస్కర్‌ రెడ్డి గోపిరెడ్డి, రాజా గౌడ్‌,శ్రీధర్‌, ఉన్నారు.

ఖోఖో విజేత రాంపూర్‌ బాలికల జట్టు..

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్‌): ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లా (నిజామాబాద్‌, కామారెడ్డి) స్థాయి అండర్‌ – 14 ఖో ఖో (బాలికలు) పోటీల్లో డిచ్‌పల్లి మండలం రాంపూర్‌ ఉన్నత పాఠశాల బాలికల జట్టు విజేతగా నిలిచింది. కామారెడ్డి జిల్లా పాల్వంచ ఉన్నత పాఠశాల మైదానంలో సోమవారం రాత్రి నిర్వహించిన ఫైనల్స్‌లో సదాశివనగర్‌ మండలం స్ప్రింగ్‌ఫీల్డ్‌ స్కూల్‌ జట్టుపై రాంపూర్‌ బాలికల జట్టు విజయం సాధించినట్లు ఫిజికల్‌ డైరెక్టర్‌ రాము తెలిపారు.

బాల్‌బ్యాడ్మింటన్‌ ఎంపిక పోటీలు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు



ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తున్న జిల్లా జడ్జి

పెర్కిట్‌(ఆర్మూర్‌): ఆర్మూర్‌ మున్సిపాలిటీ పరిధిలోని మామిడిపల్లి విజయ్‌ హైస్కూల్‌లో సోమవారం 43వ ఉమ్మడి జిల్లా బాల్‌బ్యాడ్మింటన్‌ బాలబాలికల ఎంపిక పోటీలు నిర్వహించారు. నిజామాబాద్‌, కామారెడ్డి జిల్లాలకు చెందిన 50 మంది బాలురు, 40 మంది బాలికలు హాజరయ్యారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు బాల్‌ బ్యాడ్మింటన్‌ అసోసియేషన్‌ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మానస గణేశ్‌, బీ శ్యామ్‌ తెలిపారు. సికింద్రాబాద్‌లో ఈ నెల 14, 15వ తేదీల్లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో క్రీడాకారులు పాల్గొననున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో బాల్‌ బ్యాడ్మింటన్‌ అసోసియేషన్‌ జిల్లా కోశాధికారి రాజేశ్వర్‌, సభ్యులు సురేశ్‌, గీత, పీఈటీలు సరేంద్రాచారి, మాధురి, సాయిలు, సాయినాథ్‌, యాసిన్‌ తదితరులు పాల్గొన్నారు.

ఖేలో ఇండియా తైక్వాండోకు ఎంపిక

నిజామాబాద్‌నాగారం: ఖేలో ఇండియా ఉమెన్స్‌ తైక్వాండో జాతీయ టోర్నీకి జిల్లా నుంచి ఇద్దరు క్రీడాకారులు ఎంపికయ్యారని కోచ్‌ మనోజ్‌ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను జిల్లా జడ్జి సునీత కుంచాల సోమవారం అభినందించారు. సీనియర్‌ విభాగం (57 కేజీలు)లో చౌట్‌పల్లి నేహ, జూనియర్‌ విభాగం (68 కేజీలు)లో వై సాక్షి అక్షర ఎంపికయ్యారు. ఈ నెల 11నుంచి 14వ తేదీ వరకు తమిళనాడు రాష్ట్రంలోని దిండిగల్‌ మల్టీపర్పస్‌ ఇండోర్‌ స్టేడియంలో నిర్వహించనున్న టోర్నీలో వీరు పాల్గొననున్నారు. కార్యక్రమంలో తైక్వాండో అసోసియేషన్‌ జిల్లా కోశాధికారి వెంకటరమణ గౌడ్‌, వై సాక్షి, సంతోష్‌ తదిరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌ నియంత్రణపై అవగాహన ఉండాలి



2కే రన్‌లో పాల్గొన్న విద్యార్థినులు

నిజామాబాద్‌ నాగారం: తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్‌ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యువజన దినోత్సవ సందర్భంగా నగరంలోని జీజీ కళాశాల ఆవరణలో విద్యార్థులకు 2కే రన్‌ పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా టీబీ అధికారి డాక్టర్‌ దేవి నాగేశ్వరి హాజరై జెండా ఊపి రన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఎయిడ్స్‌ నియంత్రణపై అవగాహన కలిగి ఉండాలన్నారు. రన్‌లో గెలుపొందిన వారికి మెడల్స్‌ అందజేశారు. నగదు ప్రోత్సాహకాలు, సర్టిఫికెట్లను ఎయిడ్స్‌ డేను పురస్కరించుకొని డిసెంబర్‌ 1వ తేదీన అందజేస్తామన్నారు. జీజీ కళాశాల విద్యార్థులు బాలుర విభాగంలో జ్ఞానేశ్వర్‌(మొదటి స్థానం), అజయ్‌ (ద్వితీయ స్థానం), అఖిల(తృతీయ) స్థానంలో నిలిచారు. బాలికల విభాగంలో రోజా, అఖిల, వైష్ణవి (తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలు) విజేతలుగా నిలిచారు. కార్యక్రమానికి గిరిరాజ్‌ కళాశాల వైస్‌ ప్రిన్సిపాల్‌ రఫీక్‌, జిల్లా టీబీ కో ఆర్డినేటర్‌ రవిగౌడ్‌, జీజీ కళాశాల ఫిజికల్‌ డైరెక్టర్‌ బాలమణి, మహేశ్‌, స్రవంతి, లక్ష్మి, దేవేందర్‌, గౌతమి, సుధాకర్‌ పాల్గొన్నారు.

క్రైం కార్నర్‌

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

బాల్కొండ: మెండోరా మండలం శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌ దిగువ గోదావరిలో ఆదివారం గల్లంతైన ముంబైకి చెందిన ఫిరోజ్‌(28) మృతదేహం సోమవారం లభ్యమైంది. జగిత్యాల జిల్లా కోరుట్లలోని బంధువుల ఇంటికి వచ్చిన ఫిరోజ్‌ ఆదివారం మిత్రులతో కలిసి ప్రాజెక్ట్‌ను సందర్శించేందుకు వచ్చి నీటిలో గల్లంతయ్యాడు. ప్రాజెక్ట్‌ నుంచి వరద గేట్ల ద్వారా నీటి విడుదల తగ్గుముఖం పట్టడంతో చేపల వేటకు వెళ్లిన జాలరులకు గల్లంతైన ప్రదేశం నుంచి కొద్ది దూరంలో మృతదేహం కనిపించడంతో మెండోరా ఎస్సై నారాయణకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్‌ వద్ద ఉన్న ఓ దుకాణం ఎదుట గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పట్టణ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతుడి వయస్సు 45 నుంచి 50 ఏళ్లు ఉంటుందని, మృతుడు రైలులో తినుబండారాలు అమ్ముకుంటూ జీవించేవాడని స్థానికులు తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు సమాచారం అందించాలని ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి కోరారు.

నలుగురికి జరిమానా

బోధన్‌: పట్టణ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని బెల్లాల్‌ గ్రామంలో మహిళతో ఘర్షణ పడి ఆమెను గాయపర్చిన కేసులో నలుగురికి రూ.3వేల చొప్పున జరిమానా విధిస్తూ సోమవారం బోధన్‌ కోర్టు జ్యుడీషియల్‌ ఫస్ట్‌ క్లాస్‌ మేజిస్ట్రేట్‌ ఎం పూజిత తీర్పునిచ్చారు. జరిమానా డబ్బులు కట్టని పక్షంలో 15 రోజులు సాధారణ జైలు శిక్షణ అనుభించాల్సి ఉంటుందని తీర్పులో పేర్కొన్నారు. కోర్టు అసిస్టెంట్‌ పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ సీహెచ్‌ రాణి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. బెల్లాల్‌ గ్రామంలోని గుగులోత్‌ లక్ష్మితో ఇంటి పక్కన నివసించే గుగులోత్‌ దయాకర్‌, శ్రీను, భూరి, రేక్యా, అనూష స్థలం విషయంలో తరుచూ గొడవ పడేవారు. 2018 జూన్‌ 13న సైతం గొడవకాగా, లక్ష్మిని గాయపర్చడంతోపాటు అడ్డువచ్చిన ఆమె భర్త సోమ్లాను కొట్టారు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఐదుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కోర్టులో విచారణ సాగింది. దయాకర్‌ మినహా మిగిలిన నలుగురు నిందితులకు జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు ఇచ్చారు.

ఆవు చోరీకి యత్నం



ఖలీల్‌వాడి: నగరంలోని నాల్గో టౌన్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని న్యాల్‌కల్‌ రోడ్డులో ఉన్న కొట్టంలోనుంచి దుండగులు ఆవును చోరీ చేసేందుకు యత్నించారు. ఆదివారం అర్ధరాత్రి 2 గంటల ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఆవుకు మత్తు ఇంజక్షన్‌ ఇచ్చి అది అపస్మారక స్థితిలోకి వెళ్లగానే ఇన్నోవా కారులోకి ఎక్కించే ప్రయత్నం చేస్తుండగా గో సేవకులు అప్రమత్తమై వెంబడించడంతో దుండగులు ఆర్‌ఆర్‌ చౌరస్తా, గాంధీ చౌక్‌ మీదుగా పరారయ్యారు. గోసేవకులు ఘాజిరెడ్డి హరీశ్‌రెడ్డి, అంతరెడ్డి సంపత్‌, సాయి, వర్ధన్‌, మణికంఠ, రింకు.. విశ్వహిందూ పరిషత్‌ జిల్లా సహ కార్యదర్శి ధాత్రిక రమేశ్‌కు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న రమేశ్‌ వెంటనే డయల్‌ 100కు కాల్‌ చేశారు. ట్రాఫిక్‌ ఏసీపీ నారాయణ, ఎస్సై, పోలీసు సిబ్బంది వచ్చి ఆవుని చూసి అక్కడి పరిస్థితులను తెలుసుకున్నారు. గో సేవకులు నాల్గో టౌన్‌ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా తక్షణమే దుండగులను పట్టుకొని కఠినంగా శిక్షించాలని గో సేవకులు పోలీసులను కోరారు.

రెచ్చిపోయిన పిచ్చికుక్కలు

- నందిపేట్‌, మాచారెడ్డి మండలాల్లో 20 మందికి గాయాలు
- జిల్లా కేంద్ర ఆస్పత్రులకు బాధితుల తరలింపు



బాధితుల కాళ్లు, చేతులపై గాయాలు

ఉమ్మడి జిల్లాలోని నందిపేట్‌ మండల కేంద్రంతోపాటు మాచారెడ్డి మండలం ఘన్‌పూర్‌(ఎం)లో పిచ్చి కుక్కలు రెచ్చిపోయాయి. సోమవారం ఉదయం ఆయా చోట్ల స్వైర విహారం చేస్తూ 20 మందిని గాయపర్చాయి. తీవ్రగాయాలపాలైన వారిని నిజామాబాద్‌, కామారెడ్డి జిల్లా ఆస్పత్రులకు తరలించి చికిత్స అందించారు.

నందిపేట్‌లో..

నందిపేట్‌ (ఆర్మూర్‌): మండల కేంద్రంలోని రామ్‌రెడ్డి వెల్డింగ్‌ షాప్‌ నుంచి మెయిన్‌ రోడ్డు వెంబడి లిటిల్‌ ఫ్లవర్‌ స్కూల్‌, చాకలి ఐలమ్మ, ఆనంది హాస్పిటల్‌, వ్యాన్ల అడ్డా, నటరాజ్‌ టాకీస్‌ కాంప్లెక్స్‌ ప్రాంతాల్లో పది మందిపై పిచ్చికుక్క దాడి చేసింది. ఈ ఘటనలో లిటిల్‌ ఫ్లవర్‌ స్కూల్‌ విద్యార్థితోపాటు ఆనంద్‌ ఆస్పత్రి ఆయమ్మ లసుంబాయికి తీవ్రగాయాలయ్యాయి. ప్రథమ చికిత్స అనంతరం లసుంబాయిని జిల్లా ఆస్పత్రికి తరించినట్లు మెడికల్‌ ఆఫీసర్‌ ప్రవీణ్‌ తెలిపారు. అధికారులు, వీడీసీ తగిన చర్యలు చేపట్టి కుక్కల బెడదను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

ఘన్‌పూర్‌లో..

మాచారెడ్డి: మండలంలోని ఘన్‌పూర్‌(ఎం)లో సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఓ పిచ్చికుక్క పదిమందిపై దాడి చేసింది. గ్రామానికి చెందిన కళావతి అనే మహిళ కిరాణా షాపునకు వెళ్తుండగా కొద్ది దూరం వెంబడించి కరిచింది. అలాగే అక్షిత అనే బాలిక బయటకు వెళ్తుండగా దాడి చేసింది. మధ్యాహ్నం ఆరుబయట నిద్రిస్తున్న పోచయ్య అనే వృద్ధునితోపాటు యాకూబ్‌, చైతన్య, ఆర్యన్‌, రంజిత్‌ దాడి చేయడంతో గ్రామస్తులు కుక్కను వెంబడించి చంపేశారు. బాధితులను ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స చేయించారు. తీవ్రగాయాలపాలైన వారిని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు.

నగల కోసం వృద్ధురాలిపై హత్యాయత్నం

గాంధారి(ఎల్లారెడ్డి): నగలు, డబ్బుల కోసం వృద్ధురాలిపై ఓ వ్యక్తి హత్యాయత్నం చేసిన ఘటన మండలంలోని పొతంగల్‌ కలాన్‌లో ఆదివారం చోటు చేసుకుందని ఎస్సై ఆంజనేయులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఒంటరిగా ఉండే భూమవ్వ కూలీ పనులు చేసుకుంటూ డబ్బులు కూడ బెట్టి బంగారు నగలు చేయించుకుని ధరించింది. ఆమె ధరించిన నగలు, దాచుకున్న డబ్బులపై కన్నేసిన విఠల్‌ ఆదివారం మధ్యాహ్నం ఆమెను తన ఇంటికి పిలిచాడు. కుర్చీ లో కూర్చున్న ఆమె మెడకు వెనుక నుంచి తాడు బిగించాడు. వృద్ధురాలు కేకలు వేయంతో చుట్టుపక్కల వారు వచ్చి ఏం జరిగిందని ప్రశ్నించగా, ఏమీ లేదని విఠల్‌ బుకాయించే ప్రయత్నం చేశాడు. కాలనీ వాసులు అనుమానంతో ఇంట్లో వెతుకగా వృద్ధురాలు అపస్మారక స్థితిలో పడి ఉంది. కాలనీ వాసులు వృద్ధురాలిని చికిత్స నిమిత్తం గాంధారి ఆస్పత్రికి తరలించారు. కోలుకున్న వృద్ధురాలు గ్రామస్తులతో కలిసి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఎస్సై గ్రామానికి చేరుకొని విచారణ చేపట్టారు.

నివాసపు గుడిసె దగ్ధం

- రూ.1.30 లక్షల ఆస్తి నష్టం
- భర్త దశదిన కర్మకోసం దాచుకున్న డబ్బులు బుగ్గిపాలు

ధర్పల్లి: విద్యుత్‌ షార్ట్‌ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి నివాసపు గుడిసె, అందులోని నగదు, సామగ్రి దగ్ధమైంది. ఈ ఘటన మండలంలోని కొట్టాలపల్లిలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కొత్తపల్లి లక్ష్మి భర్త, కుమారుడితో కలిసి పూరిగుడిసెలో నివాసం ఉంటోంది. ఆమె భర్త కొత్తపల్లి నర్సయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆదివారం రాత్రి విద్యుత్‌ షార్ట్‌ సర్క్యూట్‌తో మంటలు చెలరేగడంతో ఒక్కసారిగా గుడిసెకు నిప్పంటుకుంది. గుడిసెలో ఉన్న తల్లీకొడుకు బయటికి పరిగెత్తి కేకలు వేయడంతో చుట్టు పక్కలవారు వచ్చి మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. ఫైర్‌ స్టేషన్‌కు సమాచారం అందించగా అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. అప్పటికే సామగ్రితోపాటు బియ్యం, నగదు కాలిబూడిదయ్యాయి. భర్త దశదిన కర్మకోసం దాచుకున్న డబ్బులు పూర్తిగా కాలిపోయాయని బాధితురాలు బోరున విలపించింది. ఘటనాస్థలాన్ని ఆర్‌ఐ రాజేశ్వర్‌ పరిశీలించి పంచనామా నిర్వహించారు. సుమారు రూ.1.30 లక్షల ఆస్తి నష్టం జరిగిందని తహసీల్దార్‌ మాలతి తెలిపారు.

స్వాతంత్య్ర సమరయోధురాలు మృతి



మోర్తాడ్‌: మండలంలోని శెట్‌పల్లిలో స్వాతంత్య్ర సమరయోధురాలు మంగలి రాజుబాయి (101) సోమవారం తెల్లవారుజామున మృతి చెందారు. 1947 ఆగస్టు 15న దేశానికి స్వాతంత్య్రం వచ్చిన రోజు శెట్‌పల్లిలో జెండా ఎగురవేసి స్వాతంత్య్రదినోత్సవాన్ని నిర్వహించిన ఈ ప్రాంత తొలి మహిళగా రాజుబాయి గుర్తింపు పొందింది. ఆమె తన భర్తతో స్వాతంత్య్ర సంగ్రామంలో పాల్గొని గుర్తింపు పొందారు. రాజుబాయి అంత్యక్రియలను కుటుంబ సభ్యులు పూర్తి చేశారు. అంత్యక్రియలు అధికారికంగా నిర్వహించకపోవడం స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

పులాంగ్‌ వాగులో కొట్టుకొచ్చిన మృతదేహం

ఖలీల్‌వాడి: నగరంలోని నాల్గో టౌన్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని దత్తాత్రేయ స్వామి ఆలయం వెనుక ప్రాంతంలో ఉన్న పులాంగ్‌ వాగు వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కొట్టుకువచ్చింది. స్థానికుల సమాచారం మేరకు మృతదేహాన్ని బయటికి తీయించినట్లు ఎస్సై శ్రీకాంత్‌ తెలిపారు. మృతుడి వయస్సు 40 ఏళ్లు ఉంటుందని, చేయిపై అమ్మ అనే పచ్చబొట్టు ఉన్నట్లు తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు ఎస్సై (87126 59840), సీఐ (87126 59836)ను సంప్రదించాలని కోరారు.

విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు

సిరికొండ: పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన మండలంలోని హుస్సేన్‌నగర్‌ గ్రామానికి చెందిన తీనేటి బుచ్చారెడ్డి అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎల్‌ రామ్‌ సోమవారం తెలిపారు. ఆదివారం రాత్రి బుచ్చారెడ్డి ఇంట్లో గొడవ చేస్తున్నాడని డయల్‌ 100కు కాల్‌ రాగా.. సిబ్బంది అక్కడికి వెళ్లారని ఎస్సై తెలిపారు. సముదాయిస్తున్న పోలీసులతో మద్యం మత్తులో ఉన్న బుచ్చారెడ్డి దురుసుగా ప్రవర్తించి విధులకు ఆటంకం కలిగించడంతో అతడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సెల్‌ఫోన్లు, నగదు చోరీ

నవీపేట: మండల కేంద్రంలోని సుభాష్‌నగర్‌ కాలనీకి చెందిన సాయిలు నివాసపు గుడిసెలో ఆదివారం రాత్రి చోరీ జరిగిన ట్లు ఎస్సై వినయ్‌ సోమవారం తెలిపారు. సాయిలు ఆదివారం రాత్రి భోజనం చేసి నిద్రిస్తుండగా, దుండగుడు గుడిసెలోకి చొరబడి రూ.5వేల నగదు, ఏటీఎం కార్డులను ఎత్తుకెళ్లాడు. అలికిడికి మెళకువ రావడంతో సాయిలు దండుగుడి వెంటబడినప్పటికీ చిక్కలేదు. బాధితుడి ఫిర్యాదు మేరక కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.